కథ

# బ్రతుకున బ్రతుకాయె

## – సి.హెచ్. కామేశ్వరి

**వెంకట్రామయ్య నిర్ణయానికి ఇంటిల్లపాదీ విస్తుపోయారు. "ఈయనకు మతిపోయిందా! ఏమిటీ?" అని బుగ్గలు నొక్కుకున్నారు ఆడాళ్ళు. "ఈ ముసలి వయసులో కాపీనం ఎక్కువయింది. లేకపోతే నలుగురు కొడుకులు, కోడళ్ళు, పదిమంది మనవలు, మనవరాళ్ళతో కళకళలాడే ఇంటిని అయిదు ముక్కలుగా విడగొట్టి వేరు కాపురం పెట్టమంటాడేవిటి?" అని కొడుకులు చిరాకు పడ్డారు.**

ఎవరేమన్నా పట్టని భర్త మొండి పట్టుదల చూసి అరుంధతికి కూడా చిరాకు పడింది. ఎంతో నచ్చజెప్పింది. ప్రాధేయపడింది. వృద్ధాప్యంలో ఒంటరి బ్రతుకు ఎందుకంది. మరెన్నో అంది. అయినా వెంకట్రామయ్య నిర్ణయం మారలేదు. 'తల్లి మూలంగానైనా తండ్రి నిర్ణయం మారుతుందేమో!' అనుకున్న కొడుకుల ఆశ నిరాశగా మారింది.

దాంతో కోడళ్ళకి పౌరుషాలు హెచ్చాయి. "ఆయనంత పొమ్మంటుంటే మనమెందుకు చూరు పట్టుకుని వేళ్ళాడాలి? ఉమ్మడి కుటుంబంలో వుంటున్నాము కానీ, స్వతంత్రం ఏముంది? ఏదయినా మా మంచికే" అని మూతులు తిప్పారు.

'కానీ! ఏదయినా కానీ!' అనుకుంటూ ఇళ్ళ వేట మొదలుపెట్టారు. 'కొడుకులు, కోడళ్ళు, మనవలు, మనవరాళ్ళు ఎవరూ తమతో వుండరు. అందరూ వెళ్ళిపోతున్నారు. కళకళలాడే ఈ ఇల్లు బోసిపోతుంది. ఈ లంకంత కొంపలో తామిద్దరే వుండాలి!' అనుకుంటే అరుంధతికి దిగులు ముంచుకొస్తోంది. కోడళ్ళు ఎంతో అణకువగా వుంటారు. కొడుకులలో కూడా స్వార్ధం లేదు. 'మరెందుకిలా చేస్తున్నాడీయన?'. భర్తమీద చాలా అసహనంగా వుందావిడకి.

అనుకున్న రోజు రానేవచ్చింది. తమ కళ్ళెదుటే తమ వాళ్ళంతా సామాన్లతో తరలి వెడుతుంటే అరుంధతికి దుఃఖం ఆగలేదు. ఆమెను చూసిన కోడళ్ళు, మనువలు, మనవరాళ్ళు, చివరకు కొడుకులు కూడా కంటతడి పెట్టుకున్నారు. కష్టపడిన మనసుతో వెంకట్రామయ్యను చుర చురా చూస్తూ వెళ్ళిపోయారు.

అంత వరకూ అందరి రోషాలు, ఆవేషకావేషాలు, వాగ్బాణాలూ మౌనంగా అవలోకించిన వెంకట్రామయ్య దీర్ఘంగా నిట్టూర్చి "అరుంధతీ! కొంచెం కాఫీ ఇవ్వవోయ్!" అన్నాడు.

భర్త పురమాయింపు అరుంధతికి పుండుమీద కారం రాసుకున్నట్టుగా వుంది. "ఎందుకివ్వనూ! ఇవ్వకేం చేస్తానూ? నాకు మిగిలింది ఇదేగా! మీ సేవలు చేసుకొని తరిస్తాను" అని విసురుగా లోపలికి వెళ్ళిన అరుంధతిని చూసి నవ్వుకున్నాడు వెంకట్రామయ్య.

వెంకట్రామయ్య చేసిన పని బంధువర్గాల లోనూ, పాటి వారందరిలోనూ సంచలనం రేపింది.

ఎందుకిలా వీరు వేరు పడ్డారు? ఎంతో చక్కని ఉమ్మడి కుటుంబంగా పేరు తెచ్చుకున్న వెంకట్రామయ్య కుటుంబం ఇలా విడిపోవటం అందర్నీ అంతో, ఇంతో బాధించింది. నిండుగా కలసి వుండటంలోని ఐక్యత ఏమిటో అప్పుడే బోధపడినట్టయింది అందరికీ.

ఎవరెన్ని విధాలుగా అడిగినా వెంకట్రామయ్య చిరునవ్వే సమాధానమయ్యింది. కూతుళ్ళు, అల్లుళ్ళు, వియ్యాలవారు అంతా ఆక్షేపించారు. 'ఇప్పటికైనా మించిపోయిందేమీ లేదు! మీ పిల్లలు తప్పు చేస్తే మందలించాలి కానీ ఇలా దూరం చేసుకోవద్దు' అంటూ హితబోధలు చేశారు.

కోడళ్ళు రోజూ వస్తారు! అత్తగారితో అచ్చట్లు, ముచ్చట్లు అడిగి వెడతారు. కొడుకులు, మనవలు అందరూ వస్తారు. అరుంధతితో ఆప్యాయంగా వుంటూ, తనతో ముక్తసరిగా వుంటుంటే కొంచెం బాధ కలుగుతుంది వెంకట్రామయ్యకి. మరుక్షణంలో అదంతా తన నిర్ణయం వలన వచ్చిన కోపంగా అర్ధం చేసుకుని సరిపెట్టుకుండాడు.

ఆయన అంతరంగంలో ఎటువంటి బాధా వీచికలున్నాయో ఆయనకు తప్ప మరెవ్వరికీ తెలీదు.

*** *** ***

అరుంధతికి ఇరవై రోజుల నుంచి టైఫాయిడ్ జ్వరం. అలవాటు తప్పిన పనుల వల్లనో, పిల్లలు దూరమయిన బెంగ వల్లనో ఒళ్ళు తెలీని జ్వరంతో మంచం పట్టింది. అనారోగ్యంతో వున్న అరుంధతిని కంటికి రెప్పలా చూసుకుంటున్నాడు వెంకట్రామయ్య.

అరుంధతి అనారోగ్యం గురించి తెలిసిన పిల్లలు తమ దగ్గరకు రమ్మన్నా, వాళ్లని వచ్చి చేస్తామన్నా వినకుండా తనే అన్ని వాధాలా శ్రమ పడుతూ, తనకి సేవలు చేస్తున్న భర్తని చూస్తే అరుంధతి మనసు ద్రవించిపోయింది. వంటకి వంటమనిషిని పెట్టినా, మందులు ఇవ్వటం, అన్నం తినిపించటం, బట్టలు మార్పించటం, అన్నీ తనే చేస్తున్నాడు. అతనికి తనపై గల ప్రేమకి, శ్రద్ధకి చలించిపోయింది. మందులు ఇస్తున్న భర్త చేయి పట్టుకుని రుద్ధమయిన గొంతుతో "ఎందుకండీ! నాకోసం ఇంత కష్టపడతారు? మనకేం లోటు? ఎవరూ లేని వారిలా మనం ఎందుకుండాలి?" అని నీరసం స్వరంతో రెట్టించింది అరుంధతి.

అలవాటుగా మభ్యపెట్టబోతున్న భర్తని వారిస్తూ "మీరు అసలు విషయం చెప్పకపోతే మందులు కూడా వేసుకోను" అని భీష్మించుకున్న అరుంధతికి ఇంక చెప్పక తప్పలేదు.

"దీనికంతటికీ కారణం నువ్వే! నీ మాట నిలుపుకోలేక పోయావు" అంటున్న వెంకట్రామయ్య మాటలకి నిర్ఘాంతపోయింది అరుంధతి.

"నేనా! నేనేం చేశాను?" అనంటున్న భార్య మాటకి అడ్డొచ్చి 'కచ్చితంగా నువ్వే! నీవు కోడళ్ళు రాకముందు ఎలా వుండేదానివి? నేను వచ్చే వరకు ఎదురు చూసి, నేను రాగానే మంచి నీళ్ళు దగ్గర నుంచి, మంచం వరకూ, నాతోనే వుండేదానివి. నీకు జ్వరంగా వున్నా నేను వద్దంటున్నా నా పనులన్నీ నువ్వే చూసుకునేదానివి. నాకు ఒంట్లో బాగోకపోతే ఒక్క నిమిషం కూడా నన్ను వదలకుండా సేవలు చేసేదానివి. అటువంటిది నీ కోడళ్ళు వచ్చిన ఈ పదమూడు సంవత్సరాలలో నీ చేతి కాఫీ త్రాగిన రోజులు వేళ్ళ మీద లెక్క పెట్టవచ్చు! అవునా? కాదా?" అని నిగ్గదీశాడు వెంకట్రామయ్య.

ఆ మాటలు అరుంధతి గుండె కొనల్ని తాకాయి. ఎక్కడో కలుక్కుమన్నట్టయింది. భర్త కళ్ళల్లోకి చూడలేకపోయింది. వెంకట్రామయ్య పచార్లు చేస్తూ...ఆపి..తన ప్రశ్నకు భార్య దగ్గర్నుంచి జవాబు రాకపోయేసరికి–

26-3-99 * ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక



"కోడళ్ళకు అత్తగారు పనులు చెప్పవచ్చు! చేయించుకోవచ్చు! కాని భర్తకిచ్చే కాఫీ సైతం కోడళ్ళపైనే వదిలేసిన నీ బాధ్యతారాహిత్యాన్ని మాత్రం క్షమించలేకపోయాను. మనకి చేసి పెట్టేవారు ఎందరున్నా మనకి మనం లేనప్పుడు, ఎందరున్నా ఒకటే! నేను మంచి వయసులో వున్నప్పుడు, ఆఫీసు పనులలో మునిగి తేలి వున్నప్పుడు నన్నంటిన నీడలా వుండే దానివి. ఇప్పుడు రిటైరై రికామీగా ఏ బాధ్యతా లేకుండా, వయసు మీద పడి ఇంటిపట్టున వున్నప్పుడు పరోక్షంగా నిర్లక్ష్యం చేశావు.

నా బాధ్యతని కోడళ్ళకీ, పని వాళ్ళకీ వదిలావు! ఇదేనా నీ ఇంటి యజమానికి నువ్విచ్చే మర్యాద? ఇదే నా నీ జీవన సహచరుని పట్ల నీవు చూపే ఆదరణ? నువ్వు నాకు చాకిరీ చేయాలని, బానిసగా అడుగులకి మడుగులొత్తాలని కాదు! వందమందిలో వున్నా మనిద్దరం ఒక్కటిగా వుండాలి!.

పిల్లలున్నా, లేకపోయినా, 'తోడూ-నీడా', 'ఎండా-వానా', 'సూర్య-చంద్రులు' లాంటి జంట

వదాల్లా కలపి వుండాల్సిన వారు భార్యాభర్తలు. ఆ విషయాన్ని విస్మరించి 'నీవూ- నీ రోగం', 'నీవూ-నీ సుఖం', 'నీవూ-నీ ఆడంబరం' తప్ప 'మనం' అన్న భావన లేకుండా నాకు చాలా దూరమయిపోయావు.

ఇవన్నీ మీకు చెపప్పినా అర్థం కాదు. ఎవరికీ చెప్ప కునే విషయం కాదు. ప్రతి భర్తా రిటైర్ అయ్యాక ఎదుర్కొనే పరిస్థితి ఇదే! ఇద్దరే వుంటే, బాధ్య తతో వుండే ఇల్లాలు అవకాశం దొరికితే బాధ్యతలు విస్మరిస్తుందని నిరూపించావు. అసలు ఇవేమీ ఎవ రికీ చెప్పకూడదనుకున్నాను. వంట కోడలు చేసిందే కావచ్చు. వడ్డించడం భార్య కనీస కర్తవ్యం. మందులు నేను కొనుక్కున్నవే! అయితే అవి సకాలంలో నేను వేసుకుంటున్నానో లేదో నీకు పట్టదు.

భార్య మంచి ఆమాత్రం ఆదరణ లేకపోతే మగవాడి జీవితం వ్యర్థం! డబ్బు, స్టేటస్, పిల్లలు.. అన్నీ భర్త ద్వారా వచ్చినవే! భర్త ద్వారా వచ్చిన అంతస్తు, హోదా, పిల్లలను చూసుకుని అనిచ్చిన నన్ను పట్టించుకోవడం వదిలేశావు. భార్యా భర్తల అనుబంధం కేవలం మాటలకే పరిమితమయితే చాలదు. 'భోజ్యేషు మాత'లా వడ్డిస్తే పచ్చడి మెతుకయినా పాయసంతో సమానం! ప్రేమగా వడ్డించేవారు లేకుంటే పాయసమైనా వెగటు కలు 'గుతుంది! అదే నన్ను బాధ పెట్టింది. నిన్ను నాకు దూరం చేసిన కారణం కనుక్కున్నాను. నిర్ణయం తీసుకున్నాను" ఆవేశంగా ఏకబిగిన అని వూపిరి పీల్చుకున్నాడు వెంకట్రామయ్య.

భర్త వాక్ప్రవాహాన్ని వింటూ లోలోన గిల్టీగా ఫీలయ్యింది. కొంతసేపటికి "ఏమండీ! మీ మనసులో బాధ తెలీక మిమ్మల్ని తిట్టుకున్నాను. ఏదో అన్నీ సజావుగా జరిగిపోతున్నాయి. కోడళ్ళు చురుకైన వాళ్ళు. నాకు పని తగ్గించారు అని సంబరపడ్డాను. కానీ! మీ మనసులో నాపై ఇంత అసంతృప్తి వుందని గ్రహించలేకపోయాను. నన్ను క్షమించండి" అని కన్నీరు పెట్టుకున్న భార్య కళ్ళను పై పంచెతో తుడుస్తూ- "పిచ్చిదానా! ఏడవకు. జ్వరం ఎక్కువవుతుంది. విషయం తెల్పిందిగా! భార్య అంటే భర్తకి సమకాలీన జీవిత కాలపు సహచరి. నువ్వు ఇప్పటికైనా గ్రహించావు. అది చాలు నాకు. నీకోసం ఏదైనా చేస్తాను. మనం వుండగలిగినన్నాళ్ళు ఇలా వుందాము. ఒంట్లో ఓపిక లేకుంటే మన పిల్లలదగ్గరకెళ్ళి పోదాము. లేదం టావా! ఇప్పుడే వాళ్ళని రప్పించేస్తాను" అన్నాడు వెంకట్రామయ్య.

"వద్దు! ముందు మీ భార్యగా ఇదివరకు లాగే మీ మనసుకి చేరువగా వుండనీయండి. అంతవ రకూ మన మధ్య మూడో వ్యక్తి ఎవ్వరూ వద్దు!" అంది అరుంధతి దృఢ నిశ్చయంతో.

ఎన్నో ఏళ్ళ నుంచి ప్రేమరాహిత్యంతో బాధ పడు తున్న వెంకట్రామయ్యకు ప్రపంచాన్ని గెలిచినంత ఆనందం కలిగింది. నిర్మలమై మనసుతో భార్య నుదుటిని ప్రేమగా చుంబించాడు.



## దర్శకుడౌతున్న రామానాయుడు

ఇప్పటికే అందరికంటే ఎక్కువ భారతీయ భాషల్లో సినిమాలు తీసి ఘనత పొందిన స్టార్ ప్రొడ్యూసర్ డి.రామానాయుడు నిర్మా తగా వంద సినిమాలు పూర్తి చేసి గిన్నిస్ బుక్‌కి ఎక్కబోతున్నాడు. తాను తీయబోయే 101 సినిమాకు మొట్టమొదటిసారిగా తానే దర్శకత్వం వహించబోతున్నాడట. త్వరలోనే హిందూజాలతో కలిసి ఒక ఇంగ్లీషు సినిమా కూడా నిర్మించబోతున్నాడట.

# విన్నపాలు

ఇది లీలా ప్రపంచం విశ్వపు కందుక హేల ఇది క్రీడా ప్రపంచం గ్రహాల లోలాకులు కదుల్తూ సూర్య కాంతిలోనో చంద్రకాంతి లోనో సృష్టియోని పగులిచ్చిన రక్తకాంతి లోనో - ఏదో నక్షత్రం తగలబడి నీ నుదుట విభూతి అవుతుంది - స్త్రీల కోసమే నిమంత్రించిన మూత్రశాలలో నీ నీ ఆఖరి నిశ్వాసం - భిక్షుక శిష్యరికత్వంలో నీ గిటార్ గొయ్యిలో సప్త సముద్రాల్నీ కప్పేసిన నుయ్యి ఉంది ఓ ఎవరిదో నవ్వు ఉంది - ఏదో ఒక గ్రహణం తీక్షణంగా చూస్తుంది నిన్ను భయవేసి లాలి పాటలు పాడుతావు ఆకాశపు పొరని నీ కనుకొలకుల కిందికి దించుకుంటావు - బీజమే భూజమైన భయంకరాటవిలో నిను నివ్వే నరుక్కుంటూంటావు పైనించి జూపిటర్ కృష్ణ వజ్రాయుధాన్ని విదుస్తుంటాడు వృత్తాకారపు విశ్వంలో నలుదిక్కులకీ పరుగెడుతూ పరుగెడుతూ ఓ నిశ్చల చలన చిత్రంలా ఫ్రీజయి ఒక ఒక్క నిర్మోహ వాక్యానిస్తావు నేను కాదు అది నేను కాదు నేనది కాదు నేనేదీ కాదు ఏదీ నేననేది కాదనేది లేదని

—'మో'